# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

పత్రికా ప్రకటన

**జనవరి 20, 2015**

**దేశాన్ని అమ్మకానికి పెట్టి సార్వభౌమత్వం గురించి గొప్పలు చెప్పకునే గణతంత్ర దినాన్ని బహిష్కరించండి!**

**ప్రపంచ ప్రజల నెంబర్ వన్ శత్రువు అమెరికా సామ్రాజ్యవాద అధ్యక్షుడు ఒబామా రాకకు వ్యతిరేకంగా**

## జనవరి-26న భారత్ బంద్ జయప్రదం చేయండి!

గత 65 సంవత్సరాలుగా జనవరి 26ను భారత పాలక వర్గాలు గణతంత్ర దినంగా పాటిస్తున్నాయి. ఆగస్టు 15 భారత స్వతంత్ర దినంగా గణుతికెక్కింది. కానీ ఇవి రెండూ భారత ప్రజలను మోసగించే అతి పెద్ద విషాదాలు. భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులు, అదనంగా చెప్పుకునే ఆదర్శ సూత్రాలు అన్నీ ఎంత బోగసో స్వాతంత్ర్యానంతర చరిత్రను గమనిస్తే సులువుగానే బోధపడుతుంది. భారత ప్రజాస్వామ్యం అతి పెద్దదనీ, అమెరికా ప్రజాస్వామ్యం లోతైనదనీ చెప్పేదంతా ఉత్తదే! కానీ ఈ వేడుకలను దోపిడీ పాలక వర్గాలు, ప్రభుత్వాలు చాలా ఘనంగా పాటిస్తాయి. 2015 జనవరి 26 గణతంత్ర దిన వేడుకలకు ప్రపంచ ప్రజల నెంబర్ వన్ శత్రువైన అమెరికా సామ్రాజ్యవాద అధ్యక్షున్ని ఆహ్వానించడాన్ని ముక్త కంఠంతో వ్యతిరేకిస్తూ గణతంత్ర దిన వేడుకలను బహిష్కరించాల్సిందిగా మా పార్టీ భారత ప్రజలకు పిలుపునిస్తోంది. జనవరి 26న భారత్ బంద్ పాటించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తోంది.

మన ప్రియమైన భారత దేశం సర్వ సంపదలకు నిలయం. మన దేశ ప్రకృతి వనరులను, మానవ వనరులను గతంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు తమ చిత్తానుసారంగా లూటీ చేశారు. ఇప్పుడు అన్ని సామ్రాజ్యవాద దేశాలు ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాద దేశం దోపిడీ చేస్తున్నాయి. బ్రిటిష్ వలస పాలన తర్వాత మన దేశం సామ్రాజ్యవాదుల పరోక్ష పాలన, నియంత్రణ, దోపిడీలకు గురవుతూ అర్ధ వలసగా మారింది. తన ప్రపంచాధిపత్యంలో భాగంగా అనేక దేశాలలో యుద్ధోన్మాద చర్యలను ప్రోత్సహిస్తూ, పశ్చిమాసియాను ఆరని కుంపటిలా తయారు చేసి, ఇరాక్, అఫ్ఘనిస్తాన్‌లపై ప్రత్యక్ష యుద్ధానికి దిగి లక్షలాది ప్రజలను హతమారుస్తూ, మరోవైపు అనేక దేశాలపై ఆంక్షలు విధిస్తూ ప్రజలను చెప్పనలవి కాని బాధలకు గురిచేస్తున్న యుద్ధ పిపాసి అమెరికా సామ్రాజ్యవాద అధ్యక్షున్ని మన దేశానికి ఆహ్వానించడాన్ని మనమంతా గట్టిగా వ్యతిరేకించాలి. ప్రపంచ ప్రజల నెంబర్ వన్ శత్రువుకు మన దేశ 'గణతంత్ర' వేడుకలలో పాల్గొనే నైతిక హక్కైనా లేదని చాటాలి. ఒబామా గో బ్యాక్ నినాదాలతో బహిష్కరించాలి.

16వ లోక్‌సభ ఎన్నికలలో గెలిచి అధికార పగ్గాలు చేపట్టిన మోదీ గత ఎనిమిది మాసాలుగా మేక్ ఇన్ ఇండియా, జన్ ధన్ నినాదాలతో ఊగిపోతున్నాడు. కేవలం ఎనిమిది మాసాల పాలనా కాలంలోనే నెల రోజులు విదేశాల్లో గడిపి గత దేశ ప్రధానులందరినీ తలదన్నే రీతిలో దేశాన్ని అమ్మకానికి పెడుతున్నాడు. విదేశీ పెట్టుబడులు, ప్రైవేట్ పెట్టుబడులు దేశ అభివృద్ధికి దారులు వేస్తాయని బుకాయిస్తున్నాడు. మన దేశంలోని అపార ప్రకృతి వనరులను, మానవ వనరులను ముఖ్యంగా యువశక్తిని సామ్రాజ్యవాదులు దోచుకోవడానికి దారులు బార్లా తెరుస్తున్నాడు. జన ధన్ యోజన పేరుతో కోట్ల ప్రజల చిన్న పొదుపు మొత్తాలను దోపిడీదార్ల పాలు చేయడానికి కుట్రలు పన్నుతున్నాడు. అతడి నోటి నుండి వెలువడే ప్రతి మాటా, అతని ప్రతి చర్య పెట్టుబడిదార్ల ప్రయోజనాలను ఈడేర్చేవిగానే వుంటున్నది. గత కొన్ని సంవత్సరాలుగా తీవ్ర ద్రవ్య సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న సామ్రాజ్యవాద దేశాలతో మోదీ చేసుకుంటున్న వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందాలు, కుదుర్చుకుంటున్న అవగాహనా పత్రాలన్నీ బాహాటంగా దేశాన్ని అమ్మకానికి పెట్టడాన్నే తెలుపుతున్నాయి. అందుకు గుజరాత్ వైబ్రంట్ ఒక చక్కని ఉదాహరణ. 21 లక్షల కోట్ల పెట్టుబడులు దేశాన్ని ఉద్ధరించడానికి రానున్నాయంటూ దేశ ప్రజలను మోసగిస్తున్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఓటు వేయడంతోనే ప్రజల పాత్ర తీరిపోయి, ఇక ఆ గణతంత్రంలో సాగేదంతా నియంతల పాలనే అనడానికి గత 65 సంవత్సరాల దేశ పార్లమెంటరీ చరిత్ర మన ముందుంది. దేశ ప్రధాని మోదీ చర్యలను ఖండిస్తూ సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదార్ల పెట్టుబడులకు దేశంలో స్థానం లేదంటూ దేశ ప్రజలంతా పోరాడాల్సిన అవసరం మున్నెన్నటి కన్నా పెరిగింది. దేశానికి ప్రధానిని కాను, ప్రధాన సేవకుడినంటూ అగస్టు-15 నాడు మోదీ చెప్పిన మాటలు ఆయన సామ్రాజ్యవాద సేవక బుద్ధిని ఎత్తిపడుతున్నాయి. చైనా, జపాన్, బ్రిటన్, రష్యా మొదలైన దేశాల నేతల వరుసలో రాబందు అమెరికా అధ్యక్షుడు ఒబామా మన దేశానికి రావడాన్ని మోదీ ఆయన్ని సత్కరించడాన్ని వ్యతిరేకిస్తూ సామ్రాజ్యవాద పెట్టుబడులకు మన దేశం బలికాకుండా కాపాడుకుందాం.

కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడానికి ముందూ, వచ్చిన తర్వాత నేరుగా దేశ రాజకీయాలలో ఆర్ఎస్ఎస్ పాత్ర మున్నెన్నటి కన్నా పెరిగింది. ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా, ప్రధాని మోదీ త్రయం దేశంలో హిందూ మతోన్మాద చర్యలను ఎంతగానో రెచ్చగొడుతున్నారు. ఆ పార్టీ నాయకులు పలువురు ఏకంగా పార్లమెంటులోనే మతోన్మాద ప్రకటనలు చేస్తూ దేశ ప్రజలలో అభద్రతా భావాన్ని తీవ్రం చేస్తున్నారు. దేశంలోని అల్ప సంఖ్యాకులపై దాడులు తీవ్రమయ్యాయి. ఆర్టికల్ 370 రద్దుకు కుట్రలు తీవ్రమయ్యాయి. హిందూ మతం, హిందూ జాతి, అఖండ భారత్ మొదలైన మితవాద రియాక్షనరీ భావజాలాన్ని వ్యాపింప చేయడానికి వారు చేస్తున్న ప్రయత్నాలు యూదులను హతమార్చిన హిట్లర్ ఉపన్యాసాలను, చర్యలను తలపింపజేస్తున్నాయి. ఇక్కడి లాగే యూరప్‌లోనూ,

అమెరికాలోనూ రంగు బేధ ప్రజలపై దాడులు పెరుగుతున్నాయి. ఒబామా రంగులో మాత్రమే నలుపు తప్ప ఆయన అధికారంలో వున్న అమెరికాలో యేటా వందలాది నల్లజాతి ప్రజలను శ్వేత అహంకారులు హతమారుస్తుంటే 'దాతూ లేదు ఫిర్యాదూ లేదు' అన్న చందంగా ఆ 'ప్రజాస్వామ్యం' తయారైంది. ప్రపంచ ఖైదీలలో 20 శాతం ఖైదీలు యు.ఎస్.లోనే వున్నారంటే అక్కడ రంగు పేరిట అమలవుతున్న అణచివేత బోధపడుతుంది. ఇక్కడ మతం పేరిట జరుగుతున్న మారణ హెూమాన్ని గతం కన్నా ధైర్యంగా, తీవ్రంగా, విస్తృతంగా ప్రజలు ఎదుర్కొనాల్సిన అవసరం ఈనాడెంతో వుంది.

ప్రజలారా! మోదీ అధికారంలోకి వచ్చాక దేశ ప్రజలపై ముప్పేటలా దాడులు జరుగుతున్నాయి. ఆయన్ని అధికారంలోకి తెచ్చిన అదానీలు, అంబానీలు, టాటాలు, ఎస్సార్‌లు, జిందల్‌లు వారి యజమానులైన సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసం 'శ్రమేవ జయతే' అంటూ మోదీ కార్మికుల హక్కులపై, వారి జీవితాలపై గొడ్డలిపెట్టు పెట్టాడు. భూ అధిగ్రహణ చట్టంలో నిన్నటి యూపీఏను తలదన్నిన రీతిలో సవరణలు చేసి రైతుల భూములను, విశాల అటవీ క్షేత్రాలను పెట్టుబడిదార్ల డాలర్లకు అమ్మకానికి పెట్టాడు. పెసా చట్టం ద్వారా గ్రామ సభలకు ఒనగూరే అధికారాలను కాలరాచివేయడానికి మావోయిస్టుల బూచితో తీవ్ర కుట్రలకు పూనుకుంటున్నారు. సుపరిపాలన అంటూ మినిమం గవర్నమెంట్, మాగ్జిమం గవర్నెన్స్ అంటూ ప్రజా సంక్షేమ కార్యక్రమాల నుండి ప్రభుత్వ బాధ్యతలను లేకుండా చేసి ప్రజల జీవితాలను మార్కెట్‌లోకి నెడుతున్నారు. రక్షణ, బీమా, రైల్వే తదితర అనేక రంగాలను ప్రైవేటుపరం చేస్తున్నారు. మౌలిక సదుపాయాల రూపకల్పన పేరుతో దేశ వనరుల తరలింపుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు దేశంలోని మావోయిస్టు విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించడానికి గత ఐదున్నర సంవత్సరాలుగా కొనసాగుతున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడులను వర్తమాన ప్రభుత్వం మరింత తీవ్రం చేస్తున్నది. వీరి చర్యల వెనుక, నిర్ణయాల వెనుక, చట్టాల్లో సవరణల వెనుక సామ్రాజ్యవాదుల పూర్తి అండదండలున్నాయి. వారి కనుసన్నలలోనే జరుగుతున్నాయి. ఇవి మరింత, మరింతగా పెరిగే దిశలోనే వున్నాయి. వీటిని మనమంతా దృఢంగా వ్యతిరేకించాలి. ఇప్పటికే మన దేశం భోపాల్ గ్యాస్ దుర్ఘటనను అనుభవించింది. మన ప్రజల గుండెలపై అనేక అణు రియాక్టర్ల నిర్మాణానికి ఒప్పందాలు జరిగాయి. జరుగుతున్నాయి. ఇలా అన్ని రంగాలలో జరుగుతున్న మార్పులు మన దేశ ప్రజలను మరింత అగాధంలోకి నెడుతున్నాయి. దేశ సార్వభౌమత్వానికి అర్థమే లేకుండా పోతున్నది. కాబట్టి మనమంతా సమైక్యంగా నిజమైన ప్రజల స్వాతంత్ర్యం, స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్యం కోసం, అసలైన సార్వభౌమత్వం కోసం, స్వావలంబన దిశలో, వివిధ జాతుల ప్రజా రిపబ్లిక్‌లతో గూడిన స్వచ్ఛంద భారత సమాఖ్యను ఏర్పర్చుకోవడానికి పోరాడాలని మా పార్టీ స్పష్టం చేస్తున్నది. బూటకపు స్వాతంత్ర్యాన్ని, గణతంత్రాన్ని బహిష్కరిస్తూ, సామ్రాజ్యవాదులకు ఊడిగం చేసే పాలక వర్గాలను ఓడించి నూతన ప్రజాస్వామిక భారతాన్ని పోరాటాల ద్వారా నిర్మించుకుందామని మరోమారు భారత ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నది.

- ✶ **ప్రపంచ ప్రజల నెంబర్ వన్ శత్రువు ఒబామా గో బ్యాక్!**
- ✶ **సామ్రాజ్యవాదుల ప్రధాన సేవకుడైన మోదీ, పీడిత ప్రజల, దేశాల ప్రధాన శత్రువు సామ్రాజ్యవాద నాయకుడు ఒబామా దిష్టి బొమ్మలను తగులబెట్టండి!**
- ✶ **బూటకపు గణతంత్ర దినాన్ని బహిష్కరించండి!**
- ✶ **ప్రజల ప్రజాస్వామికం కోసం పోరాడండి!**

Abhay

**(అభయ్ )**
**అధికార ప్రతినిధి**
**కేంద్ర కమిటీ**
**సీపీఐ (మావోయిస్టు)**

**నోట్: అత్యవసర సర్వీసులైన ఆసుపత్రులను బంద్ నుండి మినహాయిస్తున్నాం.**